మృత్యుఘోష

- ప్రమాదాలకు నిలయంగా సాగర్ ప్రధాన రహదారి
- ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు మృత్యువుకు కారణమవుతున్న మూల మలుపులు
- సరైన సూచిక బోర్డులు లేకపోవడంతో రోజురోజుకూ పెరుగుతున్న ప్రమాదాలు.. గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- దీనికితోడు అతివేగం, మద్యం మత్తులో డ్రైవింగ్

డీసీఎం కిందకు దూసుకెళ్లిన కారు (ఫైల్)

యాచారం, జనవరి 14 : హైదరాబాద్–నాగార్జునసాగర్ ప్రధాన రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. రోజురోజుకూ ఈ రహదారి మృత్యుమార్గంగా మారుతున్నది. సాగర్ రహదారిపై ఇబ్రహీంపట్నం నుంచి మాల్ వరకు అతి ప్రమాదకరమైన మూల మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ మలుపుల వద్ద రోడ్లు, భవనాల శాఖాధికారులు సరైన ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవటంతో ప్రమాదాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రమాదంలో ఎంతో మంది మృతి చెందడంతోపాటు మరెంతో మంది కాళ్లు, చేతులు విరిగిపోయి దివ్యాంగులుగా మారి కుటుంబానికి భారంగా మారుతున్నారు. సాగర్ రహదారిపై ప్రయాణం అంటేనే ద్విచక్రవాహనదారులు భయపడుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు ఎప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటారోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో సాగర్ రహదారి సుమారు 37 కిలోమీటర్ల పొడవునా ఉంది. బొంగ్లూరు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోకి వస్తుంది. ఈ రహదారిపై గున్‌గల్‌గేటు, నక్కగుట్టతండా, చింతపట్లగేటు, తక్కళ్లపల్లిగేటు, తమ్మలోనిగూడగేటు, మాల్ మైసమ్మ టెంపుల్ అతిప్రమాదకరమైన జోన్లుగా మారాయి. ఈ మూలమలుపుల వద్ద ప్రతి రోజూ ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా అతివేగం, మద్యం సేవించడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, రాత్రిపూట అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదాలు అధికమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆర్టీఏ, పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలేదు.

ప్రమాదమని తెలిసినా..

హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిలో తక్కళ్లపల్లి, తమ్మలోనిగూడ గేట్ల వద్ద ఉన్న మూలమలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ సుమారు వందకు పైగా ప్రమాదాలు జరిగాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు దృష్టి సారించడం లేదు. ఇటీవలే తమ్మలోనిగూడ గేటు వద్ద కారు చెట్టుకు ఢీకొని ఒకరు మృతిచెందగా, రెండు లారీలు ఢీకొని ఇద్దరు మృత్యువాతపడ్డారు. తక్కళ్లపల్లి గేటు వద్ద తండ్రీ కొడుకులు మృతిచెందగా, పోలీస్‌స్టేషన్ వద్ద ఒకరు దుర్మరణంపాలయ్యారు. మాల్ మైసమ్మ టెంపుల్ వద్ద ఒకరు మరణించగా.. చింతపట్ల గేటు వద్ద ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ మలుపుల వద్ద ప్రతి వారం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంలేదని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

పెరుగుతున్న బస్సు ప్రమాదాలు

సాగర్ రహదారిపై ఇటీవల బస్సు ప్రమాదాలు కూడా అధికమయ్యాయి. అతివేగం, అజాగ్రత్తే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. గాయాలపాలవుతున్నారు. ముఖ్యంగా దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సులు ఈ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని గతంలో ఇబ్రహీంపట్నానికి చెందిన పలువురు ఆర్టీఏ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇటీవలే మండల కేంద్రంలో బస్సు ఢీకొని ఒకరు దుర్మరణంపాలవగా.. ఈ వారంలోనే మాల్ మైసమ్మ టెంపుల్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని నందివనపర్తికి చెందిన రాంరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు.

ఫోర్ లైన్ రోడ్డు లేక ప్రమాదాలు

సాగర్ రహదారిపై రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరిగిపోతున్నది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు, లారీలు, ఆటోలు, క్రూయిజర్లు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్రవాహనాలు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తున్నాయి. మాల్ నుంచి కాగజ్‌ఘట్ వరకు డబుల్ రోడ్డుండటం వలన ప్రమాదాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నది. పెరిగిపోతున్న వాహనాలను దృష్టిలో ఉంచుకుని సాగర్ రహదారి విస్తరణ పనులకు గత ప్రభుత్వం ప్రణాళికలను రచించింది. కాగజ్‌ఘాట్ నుంచి మాల్ వరకు ఫోర్ లైన్ రోడ్డుగా మార్చి, డివైడర్‌లను నిర్మిస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలుండవని పలువురు భావిస్తున్నారు.

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ(ఫైల్)

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

సాగర్ రహదారిపై తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టాలి. కాగజ్‌ఘాట్ నుంచి మాల్ వరకు డబుల్ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డుగా మార్చాలి. రోడ్డుపై సూచిక బోర్డులను, మలుపుల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేయాలి. ప్రైవేటు వాహనదారుల వేగంపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. ప్రమాదాల నివారణకు పోలీసులు, ఆర్‌అండ్‌బీ, ఆర్టీఏ అధికారులు కృషి చేయాలి.

- బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, జీఎన్‌రెడ్డి ట్రస్టు చైర్మన్, నందివనపర్తి

అక్రమంగా డీజిల్ రవాణా

- 15వేల లీటర్ల డీజిల్ తరలిస్తుండగా పట్టుకున్న కొందుర్గు పోలీసులు
- 11 మందిపై కేసు నమోదు

షాద్‌నగర్, జనవరి 14 : అక్రమంగా డీజిల్ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులను కొందుర్గు పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కొన్ని రోజులుగా కర్నాటక రాష్ట్రంలోని అడిక్కి గ్రామ పరిధిలో ఉన్న శ్రీకృష్ణ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి మట్టా ఆనంద్ అక్రమంగా డీజిల్‌ను కొనుగోలు చేసి తెలంగాణ రాష్ట్రంలోని శంషాబాద్, కొందుర్గు తదితర ప్రాంతాల్లో ఉన్న క్రషర్ మిషన్లకు సరఫరా చేస్తుండేవాడు. రూ.88లకు కొనుగోలు చేసి ప్రస్తుత ధర కన్నా రూ.3 తక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ విషయమై పక్కా సమాచారంతో కొందుర్గు పోలీసులతోపాటు డిప్యూటీ తహసీల్దార్ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి.. కొందుర్గులో 15వేల లీటర్ల అక్రమంగా తరలిస్తున్న డీజిల్‌ను పట్టుకున్నారు. ఈ కేసులో జటావత్ శేఖర్, మట్టా ఆనంద్, శ్రీనివాస్, సిద్దార్థ్, అనుదీప్, సౌరభ్, అక్షిత్, శివారెడ్డి, యాదగిరి రావు, సూర్య, దేవేందర్‌పై కేసు నమోదు చేశారు. మట్టా ఆనంద్, శేఖర్‌లను డిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కృష్ణ తెలిపారు.

నకిలీ ఆధార్, పాన్ కార్డులతో బ్యాంకు ఖాతాలు

- పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో అమాయకులకు బురిడీ
- ఫరీదాబాద్‌కు చెందిన ఇద్దరు సైబర్ నేరగాళ్లు అరెస్ట్

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ): నకిలీ ఆధార్ కార్డు, ఫాన్ కార్డులతో బ్యాంకు ఖాతాలు తెరిచి వాటిని సైబర్ ఛీటర్స్ ముఠాలకు అందిస్తున్న ఇద్దరు సైబర్ నేరగాళ్లను సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ కథనం ప్రకారం.. హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌కు చెందిన హిమాన్సు, ప్రవీణ్ ఢిల్లీకి చెందిన సైబర్ నేరగాడు దేవేందర్ పంఛాల్‌తో చేతులు కలిపారు. దేశవ్యాప్తంగా అమాయకులను మోసం చేయడం ఒక ఎత్తైతే, మోసం చేసి డబ్బులను బ్యాంకులో డిపాజిట్ చేయడం మరో ఎత్తు. ఇందులో భాగంగా బినామీ పేర్లతో బ్యాంకు ఖాతాలు సైబర్ నేరగాళ్లకు అవసరముంటాయి. ఈ బ్యాంకు ఖాతాలు తెరిచే పనిని హిమాన్సు, ప్రవీణ్ తీసుకున్నారు. ఫేక్ ఆధార్ కార్డు, ఫేక్ పాన్ కార్డులు తయారు చేసి వివిధ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి దేవేందర్ పంఛాల్‌కు అందిస్తుంటారు. ఇదిలాఉండగా అమీర్‌పేట్‌కు చెందిన బాధితురాలికి ఫోన్ చేసి పార్ట్‌టైమ్ జాబ్ ఇస్తామంటూ సైబర్ నేరగాళ్లు నమ్మించారు. పార్ట్ టైమ్ జాబ్ పేరుతో నమ్మించి ఆ తరువాత పెట్టుబడులు పెట్టిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగా బాధితురాలికి ఫోన్ చేసి రూ.4.75 లక్షలు మోసం చేశారు. సైబర్ నేరగాళ్ల మోసంపై సీసీఎస్ సైబర్ క్రైమ్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు నేతృత్వంలోని బృందం దర్యాప్తు జరిపింది. దర్యాప్తులో ఢిల్లీ నుంచి మోసం జరిగినట్లు గుర్తించారు, బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో అవి నకిలీ ఆధార్, నకిలీ పాన్‌కార్డులతో హిమాన్సు, ప్రవీణ్ తెరిచినట్లు గుర్తించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. సైబర్ మోసానికి పాల్పడిన దేవేందర్ పరారీలో ఉన్నాడు.

భవనంపై నుంచి పడి..

మెహిదీపట్నం : అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న రాజశేఖర్ చిన్న కుమారుడు ఆకాశ్(20) అల్వాల్‌లోని లయోలా కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కొంపల్లిలోని ఎన్‌సీఎల్ కాలనీలో గ్యాస్ గెడ్ గ్రీన్స్ అపార్ట్‌మెంట్‌లో ఐదో అంతస్తు భవనంపై నుంచి ఆదివారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్‌వాసులతో కలిసి పతంగి ఎగురవేస్తున్నాడు. ఈ క్రమంలో పతంగి కింద చిక్కుకుంది. చిక్కుకున్న పతంగిని బయటకు తీసేందుకు భవనంపై నుంచి కిందకు దిగేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి తీవ్ర గాయాలకు గురవ్వడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు.

ముగిసిన ధనుర్మాస పూజలు

అంగరంగవైభవంగా గోదాదేవి, శ్రీనివాసుల కల్యాణం

ఉత్సవంలో భక్తులతో కిక్కిరిసిన శ్రీవారి ఆలయ ప్రాంగణం

కల్యాణ మహోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొడంగల్, జనవరి 14 : ధనుర్మాస ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించే గోదాదేవి, మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం స్థానిక మహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అంగరంగవైభవంగా జరిగింది. ఆదివారం ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్చారణల నడుమ ఆలయ అర్చకులు బాలాజీ, ఓంప్రకాశ్, వెంకటరమణ, కిట్టుస్వామి గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరిపించారు. స్వామి వారిని కల్యాణం చేసుకునేందుకు గోదాదేవి అమ్మవారు ధనుర్మాసం నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో స్వామివారిని తిరుప్పావై పారాయణంతో మేల్కొలిపి పూజించి ప్రసన్నం చేసుకుంటుందని ఆలయ పండితుడు ధరూరి శ్రీనివాసాచార్యులు తెలిపారు. సంవత్సరంలో ఈ ఒక్కరోజే వేంకటేశ్వరుడితో గోదాదేవి పరిణయాన్ని చూసే భాగ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఇటువంటి భాగ్యం కొడంగల్ శ్రీవారి ఆలయంలో కలిగిందని భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఈ కల్యాణాన్ని వీక్షించిన భక్తులు సాక్షాత్తు ఆ తిరుమలలో జరుగుతున్న అనుభూతి పొందారు. కల్యాణ మహోత్సవంలో ఆలయ ధర్మకర్తలు అమ్మవారికి, స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ ప్రాంగణం గోవిందనామ స్మరణతో మార్మోగింది. గోదాదేవి కల్యాణంతో ధనుర్మాస పూజా కార్యక్రమాలు ముగిశాయి.

కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మూడు పేర్లతో కరణ్‌కోట పోలీస్ స్టేషన్

తాండూరు రూరల్ పోలీస్ స్టేషన్‌గా మార్చాలి

తాండూరు రూరల్, జనవరి 14 : కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌కు ఒక ప్రత్యేకత ఉన్నది. దీన్ని మూడు గ్రామాల పేర్లతో పిలుస్తారు. తాండూరు మండలం కరణ్‌కోట గ్రామంలో 1983లో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిర్మాణం తర్వాత సీసీఐ టౌన్‌షిప్‌లో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. కాలక్రమేణ మండలంలోని 33 పంచాయతీల్లో 30 పంచాయతీలను ఈ పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకువస్తూ గతంలో ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కరణ్‌కోట గ్రామం తాండూరుకు 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పోలీస్ స్టేషన్ కర్ణాటక సరిహద్దులో ఉండడంతో మండల పరిధిలోని మిగతా గ్రామాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తితే, పోలీసులు సకాలంలో చేరుకోవడానికి ఇబ్బందికరమైన పరిస్థితులు ఉండేవి. దీన్ని దృష్టిలో పెట్టుకొని పోలీసు శాఖ గౌతాపూర్ గ్రామ సమీపంలోకి కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌ను తరలించారు. మారుతి హైస్కూల్ పక్కనే గదులను అద్దెకు తీసుకొని కొన్నాళ్లపాటు అక్కడే పోలీస్ స్టేషన్‌నే ఏర్పాటు చేసి పోలీసులు విధులు నిర్వహించారు. ఇదిలావుండగా మారుతి హైస్కూల్ కరస్పాండెంట్ రాంరెడ్డి చెంగోల్ పరిధిలో గల తన సొంత పొలాన్ని కరణ్‌కోట పోలీస్ స్టేషన్ నిర్మాణం కోసం దానం చేశారు. 15 ఏండ్ల క్రితం చెంగోల్ గ్రామ పరిధిలో పోలీస్ స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. రికార్డుల్లో మాత్రం కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌గా ఉంది. కొంత మంది ఈ పోలీస్ స్టేషన్‌ను గౌతాపూర్ పోలీస్ స్టేషన్‌గా కూడా పిలుస్తారు. ఇలా ఈ పోలీస్ స్టేషన్‌ను మూడు పేర్లతో పిలుస్తుండడం విశేషం. ఈ మూడు పేర్ల కన్ఫ్యూజన్ పోవాలంటే కరణ్‌కోట పోలీస్ స్టేషన్‌ను తాండూరు రూరల్ పోలీస్ స్టేషన్‌గా మారిస్తే బాగుంటందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది.



పీఎం నరేంద్రమోదీ వర్చువల్ మీటింగ్ ఏర్పాట్లు చేస్తున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరీదేవి, ఎంపీడీవో రామకృష్ణ తదితరులు

పీఎం వర్చువల్ మీటింగ్ ఏర్పాట్లు

కడ్తాల్, జనవరి 14 : 'పీఎం జన్‌మన్ ఆదివాసీ న్యాయ అభియాన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెంచు కుటుంబాలతో నిర్వహించనున్న వర్చువల్ మీటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంలోని గిరిజన వసతి గృహంలో ఆమనగల్లు, కడ్తాల్ మండలాల పరిధిలోని చెంచులతో పీఎం నరేంద్రమోదీ సమావేశం కానున్నారు. సమావేశం అనంతరం లబ్ధిదారులకు జన్‌మన్ బ్యాంక్ అకౌంట్, కిసాన్ క్రెడిట్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, చెంచుల కోసం ప్రత్యేకంగా మెడికల్ ఎంఎంయూ వాహనాన్ని ప్రారంభిస్తున్నట్లు అధికారులు వివరించారు. రెండు మండలాల్లోని చెంచులు పీఎం వర్చువల్ మీటింగ్‌లో పాల్గొనాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రామేశ్వరీదేవి, ప్రత్యేకాధికారులు పద్మజ, కృష్ణవేణి, ఎంపీడీవో రామకృష్ణ, ఏవో శ్రీనివాస్, వార్డెన్ రాములు, జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్ పాల్గొన్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

జోరుగా.. హుషారుగా..

ధారూరు, జనవరి 14 : మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం సెలవు దినం, సంక్రాంతి సెలవులు కావడంతో పర్యాటకులు భారీగా తరలివచ్చారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు బంధువులు, స్నేహితులు తదితరులతో కలిసి వచ్చి కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేసి ప్రాజెక్టు అందాలను తిలకించారు. తమ వెంట తెచ్చుకున్న తిను బండరాలను, వన భోజనాలు చేసి సాయంకాలం వరకు ఎంజాయ్ చేసి తమ గమ్యస్థానాలకు వెళ్లారు.

పండుగ పూట పిల్లలు జాగ్రత్త

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో పిల్లల పట్ల జాగ్రతగా ఉండాలని ట్రై కమిషనరేట్ల పోలీసు కమిషనర్లు ప్రజలకు సూచించారు. గడిచిన రెండు రోజుల్లో గాలిపటాలు ఎగురవేస్తూ ఇద్దరు చిన్నారులు సహా ఒక యువకుడు భవనాలపై నుంచి కిందపడి, విద్యుదాఘాతంతో మృతిచెందిన విషయం తెలిసిందే. పిల్లలు భవనాలపైకి ఎక్కి గాలిపటాలను ఎగురవేసే సమయంలో వారి వెంట తప్పనిసరిగా పెద్దవారు ఉండేలా చర్యలు తీసుకోవాలని, భవనాలపై రేలింగ్ అంచుల వరకు వెళ్లకుండా జాగ్రతలు తీసుకోవాలని, రేలింగ్ లేని టెర్రస్‌లపై పిల్లలను అనుమతించవద్దని పోలీసులు సూచించారు. భవనాల పక్కన విద్యుత్ తీగలుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ అలాంటి భవనాలపై పిల్లలు లేదా పెద్దలు గాలిపటాలను ఎగురవేయరాదన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. రోడ్లపై వాహనదారులకు ఇబ్బంది కలిగేలా గాలిపటాలను ఎగురవేసేవారిపై చర్యలు తప్పవని, ప్రమాదాలకు కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పతంగులను మైదానాల్లో ఎగురవేయాలని సూచించారు. ప్రజలు కూడా చైనా మాంజాను వాడవద్దని సూచించారు.

రాత్రయితే పండగే..

- ప్రమాదకరంగా నిర్మాణ సామగ్రిని తరలిస్తున్న 21 వాహనాలు సీజ్
- రూ.ఆరు లక్షల జరిమానా విధించిన ఈవీడీఎం

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : రాత్రి వేళ్లలో ప్రమాదకరంగా భవన నిర్మాణ వ్యర్థాలు, నిర్మాణ సామగ్రిని తరలిస్తున్న వాహనాలపై జీహెచ్ఎంసీ ఈవీడీఎం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నది. ఎక్కడపడితే అక్కడ నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలను వేసి హైదరాబాద్ నగర విశిష్టతకు భంగం కలిగిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించి ఈమేరకు వారం రోజులుగా తనిఖీలు చేపడుతున్నది. ఇందులో భాగంగానే నిబంధనలకు విరుద్ధంగా, అందులో ప్రమాదకరంగా తరలిస్తున్న 21 వాహనాలను సీజ్ చేసి రూ.6 లక్షల మేర జరిమానా విధించారు. నిర్మాణ సామగ్రి తరలిస్తున్న 5, నిర్మాణ వ్యర్థాలను తరలిస్తున్న 15 వాహనాలను సీజ్ చేశారు. మదీనాగూడ నుంచి బండ్లగూడ, లింగంపల్లి నుంచి పటాన్‌చెరువు, ఐకియా నుంచి గోల్‌రెడ్డి తండా, గచ్చిబౌలి నుంచి గోల్ రెడ్డి తండా, షేక్‌పేట నుంచి కాళీ మందిర్, హిమాయత్‌నగర్, మాసబ్‌ట్యాంక్ నుంచి రాజేంద్రనగర్ మార్గాల్లో నిఘా పెట్టిన ఈవీడీఎం విభాగంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యర్థాలను, సామాగ్రిని తరలిస్తున్న వాహనాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకున్నారు. అనుమతి లేకుండా భవన నిర్మాణ వ్యర్థాలను తరలించే వాహనాలకు మొదటిసారి తప్పిదం చేస్తే రూ.25వేలు, రెండోసారి రూ.50వేలు, మూడోసారి పట్టుబడితే రూ.లక్ష జరిమానా విధిస్తున్నట్లు ఈవీడీఎం డైరెక్టర్ ఎన్.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

ఆస్తిపన్ను వసూళ్లలో అపసోపాలు

- లక్ష్యాలు ఖరారు చేసినా వేగం పెరగని కలెక్షన్లు
- ఈ ఏడాది నిర్దేశిత రూ.2100 కోట్ల టార్గెట్ చేరడం కష్టమే
- మొండి బకాయిదారులకు నోటీసులతో సరి.. చర్యలు శూన్యం



సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో ఆస్తిపన్ను వసూలు అధికారులకు సవాల్‌గా మారుతున్నది. మొన్నటి వరకు అసెంబ్లీ ఎన్నికలు, ప్రజాపాలనపై తొమ్మిది రోజుల పాటు అధికార యంత్రాంగం ఫోకస్ పెట్టడంతో ఆస్తిపన్ను వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చే నెలాఖరులోగా వచ్చే అవకాశాలున్నాయన్న చర్చ నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించడం కష్టంగానే మారింది. ఆస్తిపన్ను వసూళ్లలో రోజువారీ లక్ష్యాలను ఖరారు చేసినా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. వారానికో సమీక్ష నుంచి సిబ్బందికి రోజువారీ లక్ష్యాలను ఖరారు చేసి టార్గెట్‌ను సాధించలేక చేతులేత్తేస్తున్న పరిస్థితి. సర్కిళ్ల వారీగా టాప్–100 బకాయిదారులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని, జోనల్ కమిషన్లు ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని ఇటీవల కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశాలు జారీ చేశారు. కానీ ఆచరణలో కమిషనర్ ఆదేశాలను సిబ్బంది పాటించడలేదు. కనీసం జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయి పర్యటనలు, బకాయిదారులపై స్పెషల్ డ్రైవ్‌లు లాంటివి లేకపోవడం ఫలితంగా గత డిసెంబర్ నెలలో దాదాపు రూ.240 కోట్ల మేరలో సగం మేర వరకు కూడా దాటలేదని తెలుస్తున్నది. మొత్తంగా ఈ ఏడాది నిర్దేశిత రూ.2100 కోట్ల టార్గెట్‌లో ఇప్పటి వరకు రూ.1270 కోట్ల మేర వసూళ్లు రావడం, మరో రెండున్నర నెలల్లో దాదాపు రూ.830 కోట్ల మేర ఆదాయం రాబట్టడం కష్టసాధ్యమేనన్నది అధికారుల వాదన. ఇదే జరిగితే సంస్థ ఆర్థిక నష్టాల్లో మరింత కూరుకుపోయి ఉద్యోగుల వేతనాలపై తీవ్ర ప్రభావం చూపనున్నది.

ఏప్రిల్ 16 వరకు వంద రోజుల సైక్లింగ్ రైడ్

సిటీబ్యూరో, జనవరి 14 (నమస్తే తెలంగాణ) : సైక్లింగ్ ప్రోత్సహించడమే లక్ష్యంగా హైదరాబాద్ సైక్లిస్ట్స్ గ్రూప్ ఆధ్వర్యంలో వంద రోజుల సైక్లింగ్ ఛాలెంజ్ కార్యక్రమానికి నగర సైక్లిస్టుల నుంచి అనూహ్య స్పందన వస్తుందని ఆ సంస్థ ఫౌండర్ నందనూరి రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ రోజు ఐదు కిలో మీటర్లకు మించకుండా సైక్లింగ్ చేస్తూ స్ట్రావా యాప్‌లో సమయం నిక్షిప్తం చేసి వివరాలు పంపిస్తున్నారని తెలిపారు. ఈ ఛాలెంజ్ ఏప్రిల్ 16 వరకు కొనసాగుతుందని వివరించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో సైక్లింగ్‌కు విశేష ఆదరణ లభిస్తుందని.. ఇతర జిల్లాల నుంచి కూడా సైక్లింగ్ పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యంగా వంద రోజుల ఛాలెంజ్ తీసుకొని వారిని భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు.

చైనా మంజా తగిలి..

మెహిదీపట్నం/కుత్బుల్లాపూర్ జనవరి 14 : విశాఖపట్టణానికి చెందిన కోటేశ్వర్ రెడ్డి(29) ఆర్మీలో పనిచేస్తూ 20 రోజుల క్రితం బదిలీపై హైదరాబాద్‌కు వచ్చాడు. అత్తాపూర్ సమీపంలోని నలందానగర్‌లో తన భార్య, రెండు సంవత్సరాల కూతురుతో కలిసి నివాసముంటూ లంగర్‌హౌస్‌లోని గోల్కొండ మిలిటరీ ఆసుపత్రిలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సాయంత్రం లంగర్‌హౌస్ ఫ్లైఓవర్‌పై తన హోండా అక్టివాపై నుంచి వెళ్తుండగా గొంతుకు చైనా మంజా తగిలి కింద తీవ్ర గాయాలకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చ